
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
బుధవారం 21 మే 2025



ఆవులను వధిస్తే చర్యలు

● కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, మే 20 (ఆంధ్రజ్యోతి): ఆవులను, దూడలను వధిస్తే చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ బి.సత్యప్రసాద్ హెచ్చరించారు. బక్రీద్ పండగను పురస్కరించుకుని మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో పీస్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ స్లాటర్ హౌజ్‌ల వద్ద పారిశుధ్యాన్ని పర్యవేక్షించేందుకు మున్సిపల్ కమిషనర్లు చర్యలు తీసుకునే విధంగా ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ అశోక్ కుమార్, అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత, ఆర్డీవో మదుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ కక్షతోనే కేసీఆర్‌కు నోటీసులు

-జిల్లా పరిషత్ మాజీ ఛైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల అగ్రికల్చర్, మే 20(ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రయోజనాల కోసం నిర్మాణం చేపట్టిన కాళేశ్వరం ఓ బృహత్తర ప్రాజెక్టు అని, రాజకీయ కక్షతోనే మాజీ సీఎం కేసీఆర్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిషన్ నోటీసులు ఇచ్చిందని జిల్లా పరిషత్ మాజీ ఛైర్‌పర్సన్ దావ వసంత సురేష్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రజల దాహార్తిని, తెలంగాణ మడులకు గోదారి నీళ్లను మళ్లించడానికి, కోటి ఎకరాల మాగాణిని సస్యశ్యామలం చేయాలనే తలంపుతోనే కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంతో పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగి దేశానికే అన్నపూర్ణగా రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, రాజకీయ కక్షలు, కుట్రలతో కేసీఆర్‌కు నోటీసులు పంపించడం హాస్యాస్పదం అన్నారు. పరిపాలన చేతగాక కేసీఆర్‌పై కాంగ్రెస్ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతారని ఆమె జోస్యం చెప్పారు.

కొండంత పండుగ..



శోభాయాత్రలో పాల్గొన్న భక్తజనం

● కొండగట్టులో ప్రారంభమైన హనుమాన్ జయంత్యుత్సవాలు
● అంజన్నకు ప్రభుత్వం తరపున భద్రాచలం రాములోరి పట్టువస్త్రాలు
● ప్రారంభమైన త్రయాహ్నిక త్రికుండాత్మక యజ్ఞం
● రేపు పెద్ద హనుమాన్ జయంతి
● భారీగా తరలి రానున్న దీక్షాపరులు

6

ప్రవేశాల పెంపునకు కసరత్తు..

● ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల పల్లె బాట
● కళాశాలల్లో మౌలిక వసతులపై ఇంటింటి ప్రచారం
● జిల్లాలో ఫస్టియర్‌లో అందుబాటులో 3,500 సీట్లు



కోరుట్ల మండలం అయిలాపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ప్రభుత్వ బాలికల కళాశాల అధ్యాపకులు



జగిత్యాల, మే 20 (ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాల పెంపునకు అధ్యాపకులు కసరత్తు చేస్తున్నారు. వేసవిలో జూనియర్ లెక్చరర్లు కళాశాలల్లో ప్రవేశాల పెంపునకు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. జూనియర్ లెక్చరర్లు పల్లె బాట పట్టి ఇంటింటా ప్రచారం నిర్వహిస్తూ ప్రభుత్వ కళాశాలల్లో వసతులపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని అభ్యర్థిస్తున్నారు. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో లెక్చరర్లు, వసతులు ఉన్నాయని ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని అధ్యాపకులు ప్రచారం నిర్వహిస్తున్నారు.

● వసతులపై విస్తృతంగా ప్రచారం..

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో 2025- 26 విద్యా సంవత్సరానికి జూన్ తొలివారం నుంచి ప్రారంభిం చాలని ఇంటర్ విద్యాశాఖ ఇప్పటికే నిర్ణయించింది. ఇందులో భాగంగా గ్రామీణ జిల్లా జగిత్యాలలో ప్రవేశాలు కల్పించేందుకు సంబంధిత ప్రిన్సిపాల్స్ సన్నద్ధం అవుతున్నారు. జిల్లాలోని పల్లెలు, పట్టణాలల్లో తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు పెంచేందుకు స్పెషల్ క్యాంపెనింగ్ నిర్వహించాలని ప్రిన్సిపాల్స్ యోచిస్తున్నారు. దీనికి అనుగుణంగా కొందరు లెక్చరర్లు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ కళాశాలల్లో లభించే వసతులు, బోధన గురించి వివరిస్తున్నారు. వీటిలో చేరడం ద్వారా విద్యార్థులకు కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు. కళాశాలల్లో ఆంగ్లం, తెలుగు మాధ్యమాల్లో బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, హెచ్ఈసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని వివరిస్తున్నారు. వీటితో పాటు పలు కళాశాలల్లో ఉర్దూ మీడియం కోర్సులు, ఒకేషనల్ కోర్సులు సైతం అందుబాటులో ఉన్నాయని ప్రచారం నిర్వహిస్తున్నారు.

● జిల్లాలోని కళాశాలలు..

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలతో పాటు కస్తూర్బా, ఇతర గురుకుల జూనియర్ కళాశాలలు 47 వరకు ఉన్నాయి. ఇందులో 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 13 మోడల్ కళాశాలలు, 5 మైనార్టీ జూనియర్ కళాశాలలు, 5 కస్తూర్బా జూనియర్ కళాశాలలు, 3 మహాత్మా జ్యోతిరావు పూలే జూనియర్ కళాశాలు, 6 గురుకుల జూనియర్ కళాశాలలున్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సుమారు 3 వేల మంది ప్రథమ సంవత్సర విద్యార్థులు, 3,335 మంది ద్వితీయ సంవత్సర విద్యార్థులు అభ్యసిస్తున్నారు. సుమారు రెండు వేల వరకు రెసిడెన్షియల్, మైనార్టీ, బీసీ తదితర జూనియర్ కళాశాలల్లో సీట్లు అందుబాటులో ఉన్నాయి. గురుకులాలు, కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలల్ని కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేయడంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు విద్యార్థులు మొగ్గు చూపడం లేదని అధ్యాపకులు అంటున్నారు. ప్రభుత్వ అనుబంధ యాజమాన్యాల పరిధిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలతో పాటు ఆదర్శ కళాశాలలు, కేజీబీవీల సంఖ్య ఎక్కువగా ఉండడంతో గ్రామీణ విద్యార్థులు వసతి గృహం ఉన్న కళాశాలల్లో చేరేందుకు ఇష్టపడుతున్నారు.

● కార్పొరేట్‌కు దీటుగా ప్రయత్నాలు..

పేద విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భారం తగ్గించేందుకు, కార్పొరేట్‌కు దీటుగా విద్యను అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఉచిత పాఠ్య పుస్తకాలు, ఫీజు లేకుండా ప్రవేశాలు పొందేందుకు...

మిగతా 8లో

విత్తనాల ధర తగ్గించాలని రైతుల ధర్నా



ధర్నా చేస్తున్న రైతులు

రాయికల్, మే 20 (ఆంధ్రజ్యోతి): విత్తనాల ధర తగ్గించాలని రాయికల్ మండల కేంద్రంలో మంగళవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎదుట రైతులు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పెంచిన జనుము, జీలుగ విత్తనాల ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. గత సంవత్సరం రూ.1100 ఉన్న 30 కిలోల జీలుగ బస్తా రేటును ఈ సంవత్సరం రూ.2130 పెంచారన్నారు. ధర్నాతో రోడ్డుకు ఇరువైపులా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సంఘటనా స్థలానికి వచ్చిన ఏవో ముక్తేశ్వర్, ఎస్సై సుధీర్ రావులు రైతులతో చర్చించి ధర్నాను విరమింపజేశారు. అనంతరం రైతులు ఏవోకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు ఏనుగు మల్లారెడ్డి, రైతు నాయకుడు తురగ శ్రీధర్ రెడ్డి, కుర్మ మల్లారెడ్డి, సుతారి తిరుపతి, నరేందర్ రెడ్డి, భూమేష్, సంజీవ్, రాజు, మహేందర్, ప్రేమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులు క్రీడల్లో రాణించాలి'



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల అగ్రికల్చర్, మే 20(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి చదువుతో క్రీడల్లో రాణించాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక వివేకానంద మినీస్టేడియంలో నిర్వహిస్తున్న అండర్ 19 సెలెక్షన్స్‌లో భాగంగా సమ్మర్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు స్నేహ భావాన్ని పెంపొందిస్తాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట వేస్తుందన్నారు. రాష్ట్రంలో క్రీడా యూనివర్సిటీ ఏర్పాటుతో నాణ్యమైన శిక్షణ, వసతులు మెరుగయ్యే అవకాశం ఉంటుందన్నారు. సమ్మర్ శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సి పల్ మాజీ ఛైర్మన్ మెట్టభట్టి, మాజీ కౌన్సిలర్ చుక్క నవీన్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ డైరెక్టర్ జలపతి, మహేంధర్‌రావు, ప్రభాకర్‌రావు, రౌతు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

జీలుగ విత్తనాలు పంపిణీ



విత్తన బ్యాగును రైతుకు అందిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్

జగిత్యాల అగ్రికల్చర్, మే 20(ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని బీట్ బజార్‌లో గల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ కార్యాలయంలో మంగళవారం రైతులకు జీలుగ విత్తనాలను జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్, ప్యాక్స్ ఛైర్మన్ పత్తిరెడ్డి మహిపాల్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక జీలుగ బస్తా 30కిలోలు ఉంటుందని ఈ బస్తా రెండున్నర ఎకరాలకు సరిపోతుందన్నారు. వర్షాలు కురిసిన తర్వాతే విత్తనాలను నాటాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ తిరుపతి నాయక్, సీఈవో గాజంగి వేణుతో పాటు రైతులు, ప్యాక్స్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగిత్యాల డీఎస్పీగా వెంకటస్వామి



జగిత్యాల, మే 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల డీఎస్పీగా వెంకటస్వామిని నియయిస్తూ పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జగిత్యాలలో పనిచేస్తున్న డీఎస్పీ రఘుచందర్‌ను ఇంటెలిజెన్స్ డీఎస్పీగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో రామగుండం సీసీఎస్ ఏసీపీగా, కరీంనగర్ టౌన్ ఏసీపీగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న వెంకటస్వామిని జగిత్యాలకు బదిలీ చేశారు. కాగా గతంలో జిల్లాలోని మెట్‌పల్లి, సారంగపూర్, జగిత్యాల ప్రాంతాల్లో వివిధ హోదాల్లో వెంకటస్వామి పనిచేశారు. రెండు, మూడు రోజుల్లో జగిత్యాలలో వెంకటస్వామి బాధ్యతలు చేపట్టనున్నట్లు పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి.

22న 'రాజీవ్ యువ వికాసం' ఇంటర్వ్యూలు

రాయికల్, మే 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఈ నెల 22న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు రాయికల్ ఎంపీడీవో చిరంజీవి తెలిపారు. కావున ఉదయం 10 గంటలకు మైనార్టీ కార్పొరేషన్ కింద అప్లై చేసుకున్నవారు, ఉదయం 11:30 గంటలకు ఈబీసీ కింద అప్లై చేసుకున్న లబ్ధిదారులు హాజరు కావాలని పేర్కొన్నారు.

విద్యార్థినికి సన్మానం

బీర్‌పూర్, మే 20 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభను కనబరచిన బీర్‌పూర్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కడారి అమూల్యను కరీంనగర్ జిల్లా కేంద్రంలో మంగళవారం సన్మానించారు. తెలంగాణ శ్రీనివాసుల సంస్థ, ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ కరీంనగర్ ప్రేరణ ఆధ్వర్యంలో అమూల్యకు ప్రశంసా పత్రాన్ని అందించారు.

కొండగట్టు కొండపై నిరంతర పర్యవేక్షణ: ఎస్పీ



బందోబస్తును పర్యవేక్షిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

మల్యాల, మే 20(ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతి సందర్భంగా కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధిలో నిరంతర పోలీస్ పర్యవేక్షణకు ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. జయంతి ఉత్సవాల కోసం సోమవారం కొండగట్టుకు వచ్చిన ఆయన మాట్లాడారు. ఉత్సవాల కోసం నాలుగు సెక్టార్‌లో 800మంది పోలీసులచే మూడు షిఫ్ట్‌లతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. పెద్ద ఎత్తున భక్తులు తరలిరానున్న దృష్ట్యా ఎలాంటి నేరాలకు, అవాంఛనీయ సంఘటనలకు తావునివ్వకుండా భక్తులకు ఎక్కడా అసౌకర్యం కలుగకుండా సమన్వయంతో విధులు నిర్వహించాలని పోలీసులకు ఎస్పీ సూచించారు.

ప్రశాంత వాతావరణంలో దర్శనాలు కొనసాగేలా చూడాలన్నారు. కాలినడకన రహదారుల వెంట వచ్చే హనుమాన్ దీక్షపరుల ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా వారి బ్యాగులకు రేడియం స్టిక్కర్లు అంటించడం జరిగిందని చెప్పారు. అనంతరం కొండపై ఆలయ పరిసరాలు, క్యూలైన్లను ఎస్పీ పరిశీలించారు. కార్యక్రమంలో డీఎస్పీలు వెంకటరమణ, రాములు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ ఆరీఫ్‌అలీఖాన్, సీఐలు నీలం రవి, రాంనర్సింహారెడ్డి, సురేశ్, అనిల్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ వేణు, మల్యాల ఎస్సై నరేశ్‌కుమార్‌తో పాటు వివిధ జిల్లాలకు చెందిన సీఐ, ఎస్సైలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో ఎక్కువసార్లు ఓడిన నేత జీవన్‌రెడ్డినే

● ఎక్కువ సార్లు పార్టీ బీఫాంలు తీసుకున్నది ఆయనే
● మాజీ మంత్రి జీవన్‌రెడ్డిపై జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఫైర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

జగిత్యాల, మే 20(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌లో ఎక్కువసార్లు బీఫాంలు తీసుకొని ఓడిపోయిన నాయకుడు కూడా మాజీ మంత్రి జీవన్‌రెడ్డియే అని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ఘాటుగా విమర్శించారు. జగిత్యాలలో మంగళవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ తానే సీనియర్ అని, ఎక్కువసార్లు గెలిచానని చెప్పుకుంటున్న జీవన్‌రెడ్డి ఒక విషయాన్ని మరిచారన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఎక్కువసార్లు ఓడిన నాయకుడు సైతం జీవన్‌రెడ్డేనని ఆయన ఎద్దేవా చేశారు. జగిత్యాల ప్రాంత అభివృద్ధి కోసమే తాను కాంగ్రెస్ ప్రభుత్వంతో, సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి పనిచేస్తున్నానని సంజయ్‌కుమార్ తెలిపారు. మంత్రులతో తనకున్న సాన్నిహిత్యాన్ని చూసి ఓర్వలేకనే జీవన్‌రెడ్డి తనపై విమర్శలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రజలు ఓట్లేస్తేనే తాను ఎమ్మెల్యేగా గెలిచానని, నువ్వెవరివని తనను ప్రశ్నిస్తే అది ఓట్లేసిన ప్రజలను అవమానించడమేనని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. కుటుంబ రాజకీయాలను ప్రోత్సహించి, ద్వితీయ శ్రేణి నాయకత్వం లేకుండా చేసిన చరిత్ర మీది కాదా అని జీవన్‌రెడ్డిని ప్రశ్నించారు. సహనం కోల్పోయిన జీవన్‌రెడ్డి తనపై అనవసర విమర్శలు చేస్తున్నారని, సీనియర్ నాయకులు అయితే సలహాలు ఇవ్వాలే తప్ప తన హుందాతనాన్ని కోల్పోవద్దని సంజయ్‌కుమార్ హితవు పలికారు.

జీవన్‌రెడ్డినే మొత్తం జగిత్యాల అభివృద్ధి చేసినట్లుగా చెప్పుకుంటున్నారని, మరి తాను చేసిన అభివృద్ధి ఆయనకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా డబుల్ బెడ్‌రూంలు మంజూరు చేయించిన ఘనత నాదేనని స్పష్టం చేశారు. భూస్వాములు అని సంబోధిస్తున్నారని తామేం అరాచకాలు చేశామని ప్రశ్నించారు. రోడ్లశాఖ మంత్రిగా పనిచేసిన మీరు జగిత్యాల యావర్‌రోడ్ విస్తరణ ఎందుకు చేపట్టలేదన్నారు. సమావేశంలో మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్‌లు గిరినాగభూషణం, అడువాల జ్యోతి, గోలి శ్రీనివాస్, ఏఎంసీ మాజీ ఛైర్మెన్ కొలుగూరి దామోదర్‌రావు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

మల్యాల, మే 20(ఆంధ్రజ్యోతి): కొండగట్టు సమీపంలో ఆర్టీసీ బస్సు కారును ఢీకొంది. కరీంనగర్ వైపు నుంచి జగిత్యాలకు వెళ్తున్న కారు అకస్మాత్తుగా బ్రేకులు వేయడంతో వెనుకాల వస్తున్న వరంగల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో కారు వెనుక భాగం దెబ్బతినగా ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదని స్థానికులు తెలిపారు.

ఈదురు గాలుల వర్షం

● ఇంటిపై విరిగిపడిన కరెంటు స్తంభం

గంభీరావుపేట మే 20 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం ఈదురు గాలుల వర్షం కురిసింది. అరగంట పాటు ఈదురుగాలులతో కూడిన వర్షం పడడంతో ఓ ఇంటిపై విద్యుత్ స్తంభం విరిగిపడింది. విద్యుత్ స్తంభం విరిగిపడ్డ సమయంలో ఆ ఇంట్లో కుటుంబ సభ్యులు ఉన్నారు. దీంతో తృటిలో ప్రమాదం తప్పింది. విద్యుత్ నిలిచిపోవడంతో కాలనీ అంధకారంగా మారింది. విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉందని సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని కాలనీవాసులు తెలిపారు. ప్రమాదకరంగా ఉన్న స్తంభాన్ని ముందే తీసేసి కొత్త స్తంభం ఏర్పాటు చేసినట్లయితే ఇప్పుడు ఇలా జరిగి ఉండేది కాదని కాలనీవాసులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న సంబంధిత సెస్ సిబ్బంది విరిగిన పాత స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభం ఏర్పాటుకు చర్యలు చేపట్టారు.

వ్యక్తి అదృశ్యం కేసు నమోదు


శ్రీనివాస్ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, మే 20 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తి అదృశ్యంపై మంగళవారం ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు స్టేషన్ హౌస్‌ఆఫీసర్ హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన కోనేటి శ్రీనివాస్(38) ఈ నెల 18న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు.

రెండు బైకులు ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కరీంపేట గ్రామ శివారులో రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తాడికల్ గ్రామానికి చెందిన సుధాకర్ తన ద్విచక్రవాహనంపై కూతురు సంధ్యతో కలిసి బొమ్మనపల్లికి వెళ్తున్నారు. మొగిలిపాలెం గ్రామానికి చెందిన చిన్నబోయిన రాహుల్ మొగిలిపాలెం నుంచి కొండపలకలకు వస్తుండగా కరీంపేట శివారులో బ్రిడ్జి మూల మలుపు వద్ద రాహుల్ సుధాకర్ బైక్‌ను ఢీకొట్టడంతో సుధాకర్‌కు కుడి కాలికి, తలకు బలమైన గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 వాహనంలో కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో రెండు గేదెల మృతి

కథలాపూర్, మే 20 (ఆంధ్రజ్యోతి) : కథలాపూర్ మండలంలోని అంబారిపేటలో మంగళవారం జవ్వాజి ఆదిరెడ్డి అనే రైతుకు చెందిన పాడి గేదె విద్యుదాఘాతంతో మృతి చెందింది. గేదెలను గ్రామ శివారులో మేపు కోసం తీసుకు వెళ్లాడు. అనూహ్యంగా ట్రాన్స్‌ఫార్మర్ వైపు మేత కోసం వెళ్లి విద్యుదాఘాతానికి గురైందని రైతు వాపోయాడు. దీంతో లక్ష రూపాయల నష్టం వాటిల్లిందని బాధిత రైతు పేర్కొన్నాడు. ప్రభుత్వం తనకు నష్టపరిహారం అందించాలని బాధితుడు కోరాడు.

●**కథలాపూర్:** మండలంలోని అంబారిపేటలో మంగళవారం జవ్వాజి ఆదిరెడ్డి అనే రైతుకు చెందిన పాడి గేదె విద్యుదాఘాతంతో మృతి చెందింది. గేదెలను గ్రామ శివారులో మేత కోసం తీసుకెళ్లాడు. అనూహ్యంగా ట్రాన్స్‌ఫార్మర్ వైపు వెళ్లిన గేదె విద్యుదాఘాతానికి గురైందని రైతు వాపోయాడు. దీంతో లక్ష రూపాయల నష్టం వాటిల్లిందని బాధిత రైతు పేర్కొన్నాడు. నష్టపరిహారం అందించాలని బాధితుడు కోరాడు.

దళితబంధు రెండో విడత నిధులు విడుదల చేయాలి

వీణవంక,మే20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దళిత బంధు రెండో విడత నిధులను లబ్ధిదారుల అకౌంట్ల ఫ్రీజింగ్ ఎత్తివేసి వెంటనే విడుదల చేయాలని జనతాదళ్ సెక్యులర్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి వాసు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో మాట్లాడుతూ దళితబంధు పైలట్ ప్రాజెక్ట్ హుజూరాబాద్ నియోజకవర్గంలో గత ప్రభుత్వం మొదలు పెట్టిన లబ్ధిదారులకు మొదటి విడుత నిధులు విడుదల చేశాక వివిధ రకాల యూనిట్స్ పెట్టుకుని రెండో విడత నిధులు రాక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో కొటేషన్‌ల పేరిట దళారులు కోట్లు కొల్లగొట్టారని ఆరోపించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం నిధుల ఫ్రీజింగ్ ఎత్తివేసి వేంటనే దళితులను ఆదుకోవాలని కోరారు.

కొండంత పండుగ..



● కొండగట్టులో ప్రారంభమైన హనుమాన్ జయంత్యుత్సవాలు

● అంజన్నకు ప్రభుత్వం తరపున భద్రాచలం రాములోరి పట్టువస్త్రాలు

● ప్రారంభమైన త్రయాహ్నిక త్రికుండాత్మక యజ్ఞం

మల్యాల, మే 20(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో మూడు రోజుల పాటు నిర్వహించే హనుమాన్ పెద్ద జయంత్యుత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో ఉత్సవమూర్తులకు స్వస్తి వచనము, రక్షాబంధన ము, దేవతాహవనం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం యాగశాల ప్రవేశం చేశాక స్థాపిత దేవ తారాదన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. యాగశాలలో త్రయాహ్నిక త్రికుండాత్మక యజ్ఞం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, భద్రాచలం ఈవో రమాదేవి, స్థానాచార్యులు తిరుకోవెల కపీందర్, ప్రధానర్చకులు రామకృష్ణ, జితేందర్‌ప్రసాద్, రఘు ఉపప్రధాన అర్చకులు చిరంజీవస్వామి, మారుతీ, ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వైభవంగా శోభాయాత్ర

కొండగట్టు అంజన్నకు ప్రభుత్వం తరపున ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, భద్రాచలం రామాలయం నుంచి ఆలయ ఈవో ఎల్. రమాదేవి తదితరులు పట్టు వస్త్రాలు, తలంబ్రాలు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వైజంక్షన్ నుంచి శోభాయాత్ర నిర్వహించగా పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. కళాబృందాలు 108 దీపాల ప్రదర్శన, ఒగ్గు డోలు, కోలాటం, డప్పు నృత్యాలు ఆకట్టుకున్నాయి. కళాకారుల ప్రదర్శనలతో ఆధ్యాత్మికత ఉట్టిపడింది.

తరలిరానున్న దీక్షాపరులు

గురువారం జరిగే పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాల కోసం భక్తులు, అంజన్న దీక్షాపరులు వాహనాలు, కాలినడకన కొండగట్టుకు వస్తున్నారు. మంగళవారం కొండ పైన దీక్షాపరులు సందడి అంతంత మాత్రమే కాగా, బుధవారం సాయంత్రం నుంచి భక్తుల రద్దీ పెరిగే అవకాశాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. జయంతి సందర్భంగా ఆలయాన్ని, యాగశాలను పూర్తి స్థాయిలో అలంకరించకపోవడంపై పలువురు భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు.



కళాకారుల ప్రదర్శనలు




పట్టువస్త్రాలను తీసుకువస్తున్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, భద్రాచలం ఈవో రమాదేవి, కొండకు వస్తున్న దీక్షాపరులు, స్వామివారి శోభాయాత్ర

టెక్స్‌టైల్ డిప్లొమా కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

- టెస్కో జనరల్ మేనేజర్ అశోక్‌రావు


మాట్లాడుతున్న టెస్కో జీఎం అశోక్‌రావు

సిరిసిల్ల, మే 20 (ఆంధ్రజ్యోతి): చేనేత, టెక్స్‌టైల్ టెక్నాలజీ డిప్లొమా కోర్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని టెస్కో జనరల్ మేనేజర్ అశోక్‌రావు అన్నారు. మంగళవారం సిరిసిల్లలో చేనేత జౌళి శాఖ కార్యాలయంలో కొండ లక్ష్మణ్‌బాపూజీ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీలో ప్రవేశాలు పొందే విధి విధానాలు డిప్లొమా కోర్సులు, ఉపాధి మార్గాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అశోక్‌రావు మాట్లాడుతూ 2025 - 26 సంవత్సరానికి సంబంధించి మొదటి సంవత్సరంలో చేరడానికి చేనేత టెక్స్‌టైల్‌కు సంబంధించి 60 సీట్లు ఉన్నాయని తెలిపారు. పదో తరగతి పాసై జనరల్ విద్యార్థులు 15 నుంచి 23 సంవత్సరాలు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 15 నుంచి 25 మధ్య వయస్సు కలిగిన విద్యార్థులు చేరవచ్చని వివరించారు. డైరెక్ట్‌గా రెండో సంవత్సరం ఇంటర్ ఎంపీసీ, ఒకేషనల్‌కు సంబంధించిన విద్యార్థులు చేరవచ్చని జనరల్ విద్యార్థులు 15 నుంచి 23 సంవత్సరాలు, ఎస్సీ, ఎస్టీ 25 సంవత్సరాల లోపు ఉండాలని అన్నారు. ఫీజు సంవత్సరానికి రూ.4,250 ఉంటుందని విద్యార్థులు నెలవారీగా రూ 2500 ఉపకార వేతనాలను ప్రభుత్వం అందిస్తుందని అన్నారు.

ఫుడ్ సేఫ్టీ అధికారుల సోదాలు


బేకరీలో తనిఖీ చేస్తున్న ఫుడ్‌సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ అనూష

జగిత్యాల, మే 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని యావర్ రోడ్డులో అటవీశాఖ కార్యాలయం సమీపంలో గల ఓ ప్రముఖ బేకరీలో మంగళవారం ఫుడ్ సేఫ్టీ అధికారులు సోదాలు నిర్వహించారు. బేకరీలో కాలం చెల్లిన, నాణ్యత లేని ఆహార పదార్థాలను, ఫంగస్ గల ఆహార పదార్థాలను విక్రయిస్తున్నారన్న ఫిర్యాదు మేరకు ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ అనూష ఆధ్వర్యంలో సిబ్బంది సోదాలు చేశారు. బేకరీలో నిల్వ ఉంచిన పలు ఆహార పదార్థాలను పరిశీలన జరిపారు. అనుమానం గల పలు ఆహార పదార్థాలను ల్యాబ్ పరీక్షల నిమిత్తం తీసుకవెళ్లారు. ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ అనూష మాట్లాడుతూ ప్యాకింగ్‌తో విక్రయించే ప్రతీ ఆహార పదార్థాలు నాణ్యత ఉండాలన్నారు. ప్యాకింగ్‌పై వాటి తయారీ తేదీ, బ్యాచ్ నంబరు, ధర, ఎప్పటివరకు వినియోగించవచ్చన్న తదితర వివరాలను తప్పనిసరిగా ముద్రించాలని సూచించారు. ఈ కార్యక్రమంల ఫుడ్ సేఫ్టీ శాఖకు చెందిన పలువురు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.


పొత్తూరులో రాస్తారోకో చేస్తున్న రైతులు

ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని రాస్తారోకో

ఇల్లంతకుంట, మే 20 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లు వెంటనే పూర్తిచేయాలని రైతులు మంగళవారం రాస్తారోకో చేపట్టారు. మండలంలోని పొత్తూరు గ్రామానికి చెందిన రైతులు బస్టాండ్ వద్ద నిరసన చేపట్టగా జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్దం వేణు సంఘీభావం ప్రకటించారు. రైతుల రాస్తారోకోతో వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు అక్కడికి చేరుకొని రైతులకు నచ్చజెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సిద్దం శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ పట్నం అశ్విని శ్రీనివాస్, బీఆర్ఎస్ అధ్యక్షుడు కదురు శేఖర్, రైతులు రాజు, నారాయణరెడ్డి, మల్లారెడ్డి, రాజయ్య, నర్సయ్య, గోవర్దన్‌రెడ్డి, సాంబశివరెడ్డి, మోహన్‌రెడ్డి, గౌరయ్య, రాజయ్య, రవి, గుంటి అంజయ్య, సాగర్, రాజమల్లయ్య, మహేష్ పాల్గొన్నారు.

రెండు గ్రామాల మధ్య చేపల పంచాయతీ

● 23 మందిపై కేసు నమోదు

ఇల్లందకుంట, మే 20 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలంలోని మల్యాల, వాగొడ్డురామన్నపల్లె గ్రామాల మధ్య చేపల పంచాయతీలో 23మందిపై కేసు నమోదు చేసినట్లు ట్రైనీ ఎస్ఐ పిట్ల దిలీప్‌కుమార్ తెలిపారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మల్యాల, గ్రామ శివారులోని చింతల చెరువులో వాగొడ్డు రామన్నపల్లె గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్థులు చేపలు పట్టుకునేవారు. గత ఏడాది మల్యాల గ్రామస్థులు తమ చెరువులో తామే చేపలు పట్టుకుంటామని వాగొడ్డు రామన్నపల్లె వారిని అడ్డుకున్నారు. దీంతో వాగొడ్డు రామన్నపల్లె గ్రామస్థులు జిల్లా ఫిషరిస్ అధికారుల నుంచి చింతల చెరువులో చేపలు పట్టుకోవడానికి ఆర్డర్ తీసుకువచ్చారు. చెరువులోని చేపలు పట్టడానికి వాగొడ్డు రామన్నపల్లె వారికే హక్కులు ఉన్నాయని తహసీల్దార్ తేల్చిచెప్పారు. ఈ క్రమంలో ఇటీవల వాగొడ్డు రామన్నపల్లెకు చెందిన ముదిరాజ్ కులస్థులు చేపలు పడుతున్న క్రమంలో మల్యాల గ్రామస్థులు అక్కడికి చేరుకొని గొడవ చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి ఇరువర్గాలను శాంతింపజేశారు. తమ చేపల వలలు, 95 వేల రూపాయల విలువ చేసే చేపలను దొంగిలించారని వాగొడ్డు రామన్నపల్లె గ్రామస్థులు మల్యాలకు చెందిన 23మందిపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైనీ ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

నాసిరకం సరుకులు సరఫరా చేస్తున్న వారిని బ్లాక్ లిస్టులో పెట్టాలి

సుభాష్‌నగర్, మే 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎస్సీ, బీసీ, ఎస్టీ సంక్షేమ, గురుకుల, కళాశాల వసతి గృహాలకు నాసిరకం సరకులు సరఫరా చేస్తున్న వారిని బ్లాక్ లిస్టులో పెట్టాలని కుల వివక్ష పోరాట సమితి జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేష్ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఏవో సుధాకర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్స్‌లో విద్యార్థులకు నాసిరకం సరుకులు, సరఫరా చేయడం వల్ల విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారని ఆరోపించారు. బి అంజయ్య, బి చిరంజీవి, బి సంతోష్ అనే వారు సుమారు అత్యధిక హాస్టళ్లకు కూరగాయలు, చికెన్, పండ్లు, గుడ్లను సరఫరా చేస్తున్నారని తెలిపారు. గతంలో సరఫరా చేసిన కూరగాయలు, పండ్లు, చికెన్, గుడ్లు నాసిరంగా ఉండడంతో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని ఆరోపించారు. వారిని బ్లాక్‌లిస్టులో పెట్టి వారిపై కేసులు నమోదు చేయాలని కోరారు.


కాలువ పనులు అడ్డుకుంటున్న రైతు దయ్యాల నర్సయ్య

ఎల్లంపల్లి కాలువ పనులను అడ్డుకున్న రైతు

- నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్

రుద్రంగి, మే 20 (ఆంధ్రజ్యోతి) : తన భూమికి నష్ట పరిహారం ఇవ్వకుండానే అధికారులు ఎల్లంపల్లి కాలువ పనులు చేస్తున్నారని దయ్యాల నర్సయ్య అనే రైతు కాలువ పనులను అడ్డుకున్నాడు. మండల కేంద్రం శివారులోని కలికోట సూరమ్మ చెరువుకు వెళ్లే ఎల్లంపల్లి కాలువ పనులు కొనసాగుతున్నాయి. అయితే కాలువ పనులు జరగకుండా నర్సయ్య కాలువ మధ్యలో కూర్చొని నిరసన వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా రైతు దయ్యాల నర్సయ్య మాట్లాడుతూ సర్వే నంబర్ 333లో 20 గుంటల భూమి ముంపునకు గురవుతున్నట్లు తెలిపాడు. తమ భూములకు నష్టపరిహారం చెల్లించకుండా కాలువ పనులు చేపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం, ఇప్పటికైనా తనకు నష్టపరిహారం అందించాలని కోరాడు.

కల్వర్టులో పడిపోయిన మినీ కంటైనర్

● అందులోనే ఇరుక్కున్న డ్రైవర్ ● బయటకు తీసిన స్థానికులు


డ్రైవర్‌ను బయటికి తీస్తున్న రెస్క్యూ టీం, స్థానికులు

తిమ్మాపూర్, మే 20, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి- నుస్తులాపూర్ గ్రామాల మధ్యలో గల కల్వర్టును ఓ మినీ కంటైనర్ ఢీకొని కల్వర్టులోకి పల్టీకొట్టి పడిపోయింది. ఈ ప్రమాదంలో కంటైనర్ డ్రైవర్ కాలు అందులోనే ఇరుక్కుపోవడంతో అతన్ని బయటకు తీసేందుకు సుమారు రెండు గంటలకు పైగా శ్రమించారు. స్థానికులు తెలిపిన వివ రాల ప్రకారం.. ఓ ప్రైవేటు కొరియర్‌కు సం బంధించిన మినీ కంటైనర్ హైదారాబాద్ నుంచి కరీంనగర్ వైపునకు వస్తున్న క్రమంలో మంగళవారం తెల్లవారు జామున 4.30గంటల ప్రాంతంలో డ్రైవర్ అజాగ్రత్తగా నిద్రమత్తులో వాహనం నడుపుతుండటంతో కొత్తపల్లి- నుస్తులాపూర్ మధ్యలో ఉన్న కల్వర్టులోనికి దూసుకెళ్లి బోల్తాపడింది. గమనించిన స్థానిక రైతులు ఎల్ఎండీ పోలీసులకు సమాచారం అందించారు సంఘటన స్థలానికి చేరుకున్న ఎల్ఎండీ పోలీసులు, ఫైర్, టోల్‌గేట్ సిబ్బంది స్థానికులు కంటెయినర్ నుంచి డ్రైవర్‌ను బయటకు తీసేందుకు చాలా శ్రమించాల్సి వచ్చింది. డ్రైవర్‌ను 108 వాహనంలో కరీంనగర్‌లోని అసుపత్రికి తరలించారు. డ్రైవర్ యాదద్రి జిల్లా, గుండాల మండలం, అనంతరం గ్రామానికి చెందిన చెరుపల్లి సాగర్(29)గా గుర్తించారు.

రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

రాయికల్, మే 20 (ఆంధ్రజ్యోతి): రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. మండలంలోని అలూరు గ్రామంలో మంగళవారం సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ యూరియా వాడకాన్ని తగ్గిస్తూ సేంద్రియ వాడకాన్ని ఎక్కువ వినియోగిస్తూ భూమి సారాన్ని పెంచాలని, తద్వారా రైతులు లాభాలు పొందాలని సూచించారు. పచ్చిరొట్టకు సంబంధించిన జనుము, జీలుగ, పెసర, పిల్లి పెసర, అలసంద వంటి వాటిని నేలల్లో వెదజల్లి కలియదున్నాలన్నారు. అప్పుడే భూమిలో సూక్ష్మధాతువులు మంచి పంటను అందించాలంటే సత్తువ గల భూమిని తయారు చేయాలన్నారు. రసాయన ఎరువులతో భూసారం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ఏవో ముక్తేశ్వర్, జిల్లా రైతు నాయకుడు మెక్కొండ రాంరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కారులో ఊపిరాడక యువకుడి మృతి

సిరిసిల్ల క్రైం, మే 20(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని వెంకట్రావునగర్‌కు చెందిన పసునూరి రాజేశ్ (35) అనే వ్యక్తి కారులో ఊపిరాడక మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. పట్టణంలోని వెంకట్రావునగర్‌కు చెందిన రాజేశ్ ఫ్రూటీ, హ్యాపీ ఫిజ్ అనే శీతలపానీయాల హెడ్‌గా పనిచేస్తుంటాడు. ఇదే క్రమంలో ఈ నెల 18న రాత్రి ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ శివారులో గల గోదాంకు స్టాక్ వచ్చిందని ఇంట్లో కుటుంబ సభ్యులకు చెప్పి రాజేశ్ బయటకు వెళ్లాడు. ఆ రోజంతా ఇంటికి రాకుండానే సోమవారం ఉదయం 6గంటలకు అతిగా మద్యం సేవించి ఇంటికి వచ్చి మళ్లీ బయటకు వెళ్లిపోయాడు. ఆ తర్వాత తన కారును కొత్త బస్టాండ్ సమీపంలో పార్క్ చేసుకొని మద్యం సేవించి కార్ లాక్ చేసుకొని అందులోనే ఉన్న రాజేశ్ ఊపిరాడక మృతి చెందాడు. అయితే తన భర్త ఇంటికి రాలేదని బయటకు వెళ్లి చూస్తే లేకపోవడంతో అనుమానం వచ్చి సోమవారం రాత్రి 11.30 గంటలకు కారు వద్దకు వెళ్లి చూసేసరికి తన భర్త కారులోనే చనిపోయి ఉన్నాడని గుర్తించి చుట్టుపక్కలవారికి, కుటుంబ సభ్యులకు భార్య బాలమణి సమాచారం అందించింది. గత 2019 నుంచి అనారోగ్యంతో బాధపడుతూ ఉన్నాడని, ఇదే క్రమంలో అతిగా మద్యం సేవించడం వల్ల కారులో ఊపిరాడక డీహైడ్రేషన్ వల్ల చనిపోయి ఉంటాడని రాజేష్ భార్య పోలీసలుకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నది. తన భర్త మృతికి ఎవరిపై అనుమానం లేదని భార్య బాలమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు.

దొంగ అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): ఓ ఇంట్లో చోరీ చేసి తప్పించుకొని తిరుగుతున్న దొంగను పోలీసులు పట్టుకొని సొత్తును స్వాధీనం చేసుకొని నిందితుడిని మంగళవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామానికి చెందిన ఈరవేణి సత్యనారాయణ హమాలీ పని చేసుకొని జీవిస్తున్నాడు. ఖర్చులకు డబ్బులు సరిపోకపోవడంతో సొంత అవసరాల కోసం ఈజీగా డబ్బులు సంపాదించాలని ప్లాన్ చేశాడు. ఈ క్రమంలో తన ఇంటి దగ్గరలో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డాడు. బీరువా తాళం పగలగొట్టి బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. పోలీసులు చాకచక్యంగా సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గొల్లపల్లి బస్టాండ్ వద్ద పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి బంగారు లక్ష్మీహారం, నెక్లెస్, రెండు చైన్‌లను స్వాధీనం చేసుకున్నామని సీఐ శ్రీనివాస్‌గౌడ్ వెల్లడించారు. సత్యనారాయణను రిమాండ్‌కు తరలించారు. కేసును చేధించిన ఎస్ఐ రమాకాంత్, పీఎస్ఐ లక్ష్మణ్, కానిస్టేబుళ్లు బాబయ్య, రషీద్, శ్రీనాథ్, శ్రీనివాస్‌లను సీఐ అభినందించారు.



సరస్వతి.. నమోస్తుతే

- పుష్కరాలకు కొనసాగుతున్న భక్తుల రద్దీ
- ఆరో రోజు 50 వేల మంది పుణ్యస్నానాలు..
- నదిలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాల మోహరింపు...


స్వామివారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు


గోదావరికి చీరె సారె సమర్పిస్తున్న భక్తులు




పూజలు చేస్తున్న భక్తులు

భూపాలపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి నది పుష్కరాలకు భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఎండలను సైతం లెక్కచేయకుండా జనం తరలివచ్చి సరస్వతి అంతర్వాహిని లో పవిత్ర స్నానాలు ఆచరించారు. పుష్కరాల్లో ఆరో రోజైన మంగళవారం దాదాపు 50 వేల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు. రెండు రోజులుగా ఎండల తీవ్రత పెరగడంతో దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఉదయం 12 గంటల లోపు, సాయంత్రం నాలుగు గంటల తర్వాత కాళేశ్వర క్షేత్రానికి తరలి వచ్చి పుష్కరస్నానాలు చేశారు. మూడు రోజులపాటు పోటెత్తిన భక్తుల సంఖ్య రెండు రోజుల్లో కొంత తగ్గినప్పటికీ భక్తులు సెంటిమెంట్ ప్రకారం పుణ్య స్నానాలకు రాలేదని అధికారులు భావిస్తున్నారు.



మంగళవారం అష్టమి కావడంతో సాధారణంగానే ఇక్కడ పిండ ప్రదాన కార్యక్రమాలను నిలిపివేస్తారు. గురువారం నుంచి భక్తుల సంఖ్య మళ్లీ పుంజుకునే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు గత మూడు రోజుల్లో ఉత్పన్నమైన సమస్యలను పునరావృతం కాకుండా చూసేందుకు ముందస్తు చర్యలు ప్రారంభించారు. ముఖ్యంగా సరస్వతీ ఘాట్‌కు వెళ్లే దారిని మరింత విస్తరించి రేలింగ్ చేశారు. భక్తులరాక వల్ల రోడ్డు పై దుమ్మురేగకుండా ట్యాంకర్ల ద్వారా నీళ్లను చల్లు తూ క్యూరింగ్ చేస్తున్నారు. మంగళవారం పుష్కరాలకు వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఎండ వేడి నుంచి రక్షణ కలిగించేలా చలువ పందిళ్ల, తాగునీరు, ఉచితంగా మజ్జిగ ప్యాకెట్ల పంపి ణీ జిల్లా అధికార యంత్రాంగం చేపట్టింది. కలెక్టర్ రాహుల్ శర్మ పుష్కరాలు జరుగుతున్న ఘాట్లలో తిరుగుతూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ఎస్పీ కిరణ్ ఖరే ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా వాహనాల రాకపోకలను ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరించారు. పుష్కరాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడడం కోసం ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి సీసీ కెమెరాల ద్వారా పరిస్థితులను సమీక్షిస్తూ పోలీసు అధికారులకు ఎప్పటికప్పుడు తగిన సూచనలు సలహాలు అందించారు.

మంగళవారం హైకోర్టు న్యాయమూర్తి సృజన, ఇంటెలిజెన్స్ బ్యూరో ఐజీ తరుణ్ జోషి తదితరులు నదిలో పుణ్యస్నానాలు చేసి స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గోదావరిలో ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా నివారించడం కోసం అధికార యంత్రాంగం నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఫోర్స్(ఎన్‌డీఆర్ఎఫ్), సింగరేణి రెస్క్యూ బృందాలను, గజ ఈతగాళ్లను పుష్కర ఘాట్‌లో మోహరించారు.



ఏఎస్సైలకు పదోన్నతులు

కరీంనగర్ క్రైం, మే 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పోలీస్‌కమిషనరేట్‌లో పలు పోలీస్ స్టేషన్‌లలో ఏఎస్సైలుగా పని చేస్తున్న తొమ్మిది మందికి ఎస్సైలుగా పదోన్నతులు లభించాయి. ఈ మేరకు పోలీసుశాఖ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. మల్టీజోన్ నుంచి మొత్తం 22 మంది ఏఎస్సైలు పదోన్నతులు పొందారు. వీరందరిని ప్రస్తుతం జిల్లాలకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలోనే పోలీస్ స్టేషన్ల కేటాయింపు, పోస్టింగ్‌లు వెలువడనున్నాయి.

డిగ్రీ పరీక్షల్లో 8 మంది డీబార్

గణేశ్‌నగర్, మే 20 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షల్లో మంగళవారం మాల్ ప్రాక్టీస్ చేసిన ఎనిమిది మంది విద్యార్థులను డీబార్ చేసినట్లు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ తెలిపారు. వాగేశ్వరి డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో నలుగురు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల పెద్దపల్లిలో ఒకరు, వాణినికేతన్ డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఒకరు, శివాని డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఇద్దరి చొప్పున డీబార్ చేసినట్లు వివరించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కరీంనగర్ క్రైం, మే 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని పద్మ నగర్ పరిధిలో మానేరు జలాశయం నీటి గుంతలో గుర్తుతెలియని వ్యక్తి (40) మృతదేహం లభ్యమైందని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. నీటి గుంతలో వ్యక్తి మృతదేహం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని మంగళవారం రాత్రి బయటకు తీసి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చల్లగా చూడమ్మా..

- బద్ది పోచమ్మకు బోనం మొక్కులు
- క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

వేములవాడ కల్చరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి అనుబంధ ఆలయమైన బద్ది పోచమ్మ అమ్మవారికి భక్తులు మంగళవారం బోనం మొక్కులు చెల్లించుకున్నారు. సోమవారం రాజన్నను దర్శించుకున్న భక్తులు బద్ది పోచమ్మ అమ్మ వారిని దర్శించుకోవడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఉదయాన్నే భక్తులు మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని డప్పు చప్పుళ్ల మధ్య శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా అమ్మ వారి ఆలయానికి చేరుకున్నారు. నెత్తిన బోనాలతో గంటల తరబడి భక్తులు క్యూలైన్ లో బారులు తీరి ఆలయంలోకి ప్రవేశించారు. అమ్మవారికి పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకుని నైవేద్యాన్ని సమర్పించి పిల్లాపాపలు పాడిపంటలు చల్లగా ఉండాలని వేడుకున్నారు.


అమ్మవారి దర్శనం కోసం బోనాలతో క్యూలైన్‌లో నిరీక్షిస్తున్న భక్తులు

చిన్నకలువలలో సీతారాముల కల్యాణం

సుల్తానాబాద్, మే 20: (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నకలువల సంకట విమోచన వీరహన్‌మాన్ ఆలయంలో మంగళవారం సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్త వంగపల్లి సుగుణాకర్‌రావు అనసూయ దేవిదంపతుల ఆధ్వర్యంలో సత్యనారాయణచార్యులు వేదమంత్రోచ్చారణల మధ్య స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఉదయం కల్యాణం జరగగా సాయంత్రం హవనము, బలిహరణము, తీర్థగోష్టి నిర్వహించారు. బుధవారం ఆలయ ఆవరణలో సీతారామచంద్ర స్వాముల పట్టాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం జరిగే హన్‌మాన్ పెద్ద జయంతి వేడుకలకు భక్తులు పాల్గొనాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.


స్వామివారి ఉత్సవమూర్తులు

బాక్సింగ్‌లో సత్తా చాటుతాం

- ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరం
- 55 మంది క్రీడాకారులు హాజరు




బాక్సింగ్‌లో శిక్షణ పొందుతున్న బాలబాలికలు

కరీంనగర్ స్పోర్ట్స్, మే 20 (ఆంధ్రజ్యోతి): బాక్సింగ్ రింగ్‌లో పంచ్ పవర్ చూపించడ మంటే సాధారణ విషయం కాదు. అలాంటి క్రీడలో ఆరితేరాలంటే ముందుగా ధైర్య సాహసాలు అలవర్చుకోవాలి. మంచి కండ పుష్టి కలిగి ఉన్నవారే బాక్సింగ్‌లో రాణిస్తారు. ఇటీవల కాలంలో ఒలింపిక్స్‌లో మేరీకోమ్, లవ్లీనా, విజేందర్ ప్రత్యర్థులను మట్టి కరిపించి పతకాలు సాధించారు. తెలుగు తేజం నిఖత్ జరీన్ ప్రపంచ చాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకుంది. దీంతో బాక్సింగ్ క్రీడ గ్రామస్థాయికి చేరింది. వేసవి క్రీడాశిబిరాల సందర్భంగా జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో బాక్సింగ్‌లో శిక్షణ అందిస్తున్నారు. దీంతో జిల్లా కేంద్రంలోని అనేక మంది చిన్నారులు శిక్షణ పొందుతూ ప్రతిభ చాటుతున్నారు. కోచ్‌లు జి.సత్యనారాయణ, కొత్తకొండ సంపత్, జి.మురళి చిన్నారులను శిబిరంలో శిక్షణ ఇస్తున్నారు.

55 మంది చిన్నారుల హాజరు

కరీంనగర్ నగరపాలక సంస్థ, జిల్లా క్రీడా శాఖ సంయుక్తంగా కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి బాక్సింగ్ క్రీడా శిక్షణ శిబిరానికి 55 మంది క్రీడాకారులు హాజరవుతున్నారు. వీరికి కోచ్‌లు అధునాతనమైన టెక్నిక్స్ నేర్పిస్తున్నారు. ప్రతీ రోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు శిక్షణ అందిస్తున్నారు.

నిఖత్ జరీన్ రోల్ మోడల్ జి.హరిణిశ్రీ, కరీంనగర్



బాక్సింగ్ అంటే చాలా ఇష్టం. బాక్సింగ్ క్రీడాకారిణి నిఖత్ జరీన్ నాకు రోల్ మోడల్. ప్రపంచ చాంపియన్‌గా నిలిచి అందరి అభిమానాన్ని చూరగొంది. నేను కూడా ఆమెలా బాక్సింగ్ నేర్చుకుంటాను. అంతర్జాతీయ పోటీల్లో దేశానికి ప్రాతినిధ్యం వహించేందుకు కృషి చేస్తా.

మంచి బాక్సర్‌గా ఎదుగుతా జి.హరిహరన్, కరీంనగర్



మంచి బాక్సింగ్ క్రీడాకారుడిగా ఎదగాలన్నదే నా లక్ష్యం. అందు కోసం ఈ వేసవి ఉచిత క్రీడా శిక్షణ శిబిరాల్లో బాక్సింగ్‌ను ఎంచుకున్నాను. కోచ్‌లు శిక్షణలో మెళకువలను నేర్పిస్తున్నారు. ఉచిత వేసవి శిబిరాలను నిర్వహిస్తున్న నగరపాలక సంస్థకు ధన్యవాదాలు.





పెట్రోల్ బంక్‌ల్లో పలు సేవలు

సౌకర్యాలు పొందడం వినియోగదారుల హక్కు

ఇల్లందకుంట, మే 20 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్ బంకుల్లో డీజిల్, పెట్రోల్ కొట్టించుకోకపోయినా కొన్ని సేవలను వినియోగదారులు ఉచితంగా పొందవచ్చు. పెట్రోల్ బంక్‌కు వెళ్లినప్పుడు చాలా మంది తమ వాహనాలను ఇంధనం నింపించుకోవడమే కానీ అక్కడ అందుబాటులో ఎలాంటి సౌకర్యాలు ఉన్నాయని తెలుసుకోరు. అంతేకాకుండా కొన్నిసార్లు బంక్ సిబ్బంది దురుసుగా ప్రవర్తించడం, గాలి నింపడం కోసం డబ్బులు వసూలు చేయడం వంటివి చేస్తుంటారు.

- వాహనాల టైర్లలో గాలి నింపే మిషన్ తప్పనిసరిగా ఉండాల్సిందే. అక్కడ నిరంతరం ఒక వ్యక్తి అందుబాటులో ఉండి ఉచితంగా సేవలందించాలి. కస్టమర్ తన ఇష్టానుసారం ప్రకారం డబ్బులు ఇవ్వవచ్చు. డబ్బులు డిమాండ్ చేయరాదు.
- స్త్రీలకు ప్రత్యేకమైన మరుగుదొడ్లు అందుబాటులో ఉంచాలి. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా ప్రతి బంక్‌లో శుభ్రమైన మరుగుదొడ్లు ఉండాలి.
- తాగునీటి కోసం స్వచ్ఛమైన ఆర్వో వాటర్ అందించాల్సిన బాధ్యత బంక్ యాజమాన్యందే. ఎవరైనా ఉచితంగా ఆ నీటిని వినియోగించుకోవచ్చు. ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే ఉపయోగించు కునేందుకు ప్రథమ చికిత్స అందుబాటులో ఉండాలి. అత్యవసర సమయంలో ఉపయోగించుకునేందుకు ఫోన్ సౌకర్యం ఉండాలి.
- పెట్రోల్, డీజిల్ నాణ్యతపై అనుమానం ఉంటే బంక్‌లోనే పరీక్షించుకునే వెసులుబాటు ఉంటుంది. ఈ పరీక్షలకు కావాల్సిన పరికరాలు, ఫిల్టర్ కాగితాలు అందజేయాల్సిన బాధ్యత కూడా బంక్ సిబ్బందిదే. ఇంధనం తక్కువగా వచ్చినట్లు అనుమానం వస్తే అక్కడే చెక్ చేసుకోవాలి.
- వినియోగదారుల ఫిర్యాదు కోసం ప్రత్యేకంగా పెట్టె ఏర్పాటు చేయాలి. పెట్రోల్ బంక్‌లో సరైన సౌకర్యాలు లేనట్లయితే సిబ్బంది దురుసుగా ప్రవర్తించినా సంబంధిత చమురు సంస్థలకు ఫిర్యాదు చేయవచ్చు.

భారత్ పెట్రోలియం (బీపీసీఎల్) టోల్ ఫ్రీ నంబర్ 1800224344, ఇండియన్ ఆయిల్ (ఐఓసీఎల్) 18002333555, హెచ్‌పీఎల్ 18002333555, రిలయన్స్ 18008919023 నంబర్లకు ఫోన్ చేసి మీ సమస్యను తెలియజేయవచ్చు. వినియోగదారుల హక్కులను పరిరక్షించుకోవడం అందరి బాధ్యత. పెట్రోల్ బంక్‌ల్లో అందుబాటులో ఉన్న సేవలను వినియోగించుకోవడం ద్వారా మీ ప్రయాణాన్ని మరింత సౌకర్యవంతంగా మార్చుకోవచ్చు.

కాంగ్రెస్‌పార్టీ అధికార ప్రతినిధిగా సురేష్

ఇల్లంతకుంట, మే 20 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని వెల్జీపూర్ గ్రామానికి చెందిన గండికోట సురేష్‌ను కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా అధికార ప్రతినిధిగా నియమిస్తున్నట్లు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మానకొండూర్ నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం నియామక పత్రాన్ని అందించారు. పార్టీ అభివృద్ధికి కృషిచేయాలని, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకవెళ్లాలని ఎమ్మెల్యే సూచించినట్లు తెలిపారు. మాజీ ఎంపీపీ వెంటకరమణారెడ్డి అధికార ప్రతినిధిగా నియామకం అయిన సురేష్‌ను అభినందించారు.

కొప్పుల అక్రమ ఆస్తుల చిట్టాను బయటకు తీస్తాం

- మిగతా మంత్రుల్లాగా ఈ ప్రాంతాన్ని ఎందుకు అభివృద్ధి చేయలేదు?
- 2014 నుంచి అక్రమ కేసులు పెట్టి రాక్షస పాలన చేసింది నీవు కాదా?
- 15 నెలల్లోనే మా ప్రభుత్వంపై ఆక్రోశం ఎందుకు?

ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మారం, మే 20 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ రాష్ట్ర వ్యాప్తంగా కూడగట్టిన అక్రమ ఆస్తుల చిట్టాను బయటకు తీస్తామని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ధర్మారం, వెల్గటూర్ మండలాల కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలతో గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లను సందర్శిద్దామని, అక్కడి మంత్రులు చేసిన అభివృద్ధిని తోటి మంత్రిగా ధర్మపురి నియోజకవర్గాన్ని ఎందుకు అభివృద్ధి చేయలేక పోయారో చెప్పాలని ప్రశ్నించారు.

ధర్మపురి నియోజకవర్గ డీఎంఎఫ్‌టీ నిధులు 15 వందల కోట్లు సిద్దిపేటకు, 2 వేల కోట్లు గజ్వేల్‌కు తీసుకుపోతుంటే ఎందుకు మాట్లాడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీష్‌రావు మేడారంలో రాత్రిళ్లు బస చేసి మన నీళ్లను సిద్దిపేటకు తీసుకపోతుంటే కొప్పుల ఎందుకు అడ్డుకోలేదని అడ్లూరి ప్రశ్నించారు. రాష్ట్ర మంత్రిగా ఉండి నియోజకవర్గానికి చేసిన ఒక్క పని చూపించాలని ఎద్దేవా చేశారు. మీ పాలనలో ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ప్రతీ ఒక్కరిపై అక్రమ కేసులు పెట్టారని, సామాన్య ప్రజలనుంచి నీకు వ్యతిరేకంగా వార్తలు రాసిన రిపోర్టర్ల దాక కేసులు పెట్టి వేధించావని గుర్తుచేశారు. ప్రభుత్వం వచ్చి 15 నెలల కాలంలోనే మీకు ప్రభుత్వంపై, నాపై అంతా ఆక్రోశం ఎందుకని, మరో మూడు సంవత్సరాల వరకు 10 ఏండ్లలో నీవు చేయని అభివృద్ధిని నేను చేసి చూపిస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు.


తనపై పెట్టిన కేసుల వివరాలను చూపిస్తున్న ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

వెల్గటూర్ మండలంలోని పాశి గామలో ఇథనాల్ ప్రాజెక్ట్‌ను ప్రతిపక్ష నాయకుడిగా నేను వ్యతిరేకిస్తే నాపై అక్రమ కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. తనపై పెట్టిన నాన్ బేయిలేబుల్ కేసుల ప్రతులను సమావేశంలో అడ్లూరి ప్రదర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణ సమయంలో భూములు కోల్పోయిన రైతులకు చొప్పదండి నియోజకవర్గంలో ఎకరాకు 20 లక్షలు ఇప్పిస్తే, ఇక్కడి రైతులకు 7 లక్షల నష్టపరిహారం ఇవ్వడంలో ఆంతర్యం ఏమిటని, మీకు మెగా కంపెనీకి ఉన్న లోపాయికార ఒప్పందం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2004 నుంచి 2023 వరకు కొప్పుల రాష్ట్ర వ్యాప్తంగా సంపాదించిన అక్రమ ఆస్తులను, హైదరాబాద్ శివారులోని స్టోన్ మెటల్ క్వారీస్ సంబంధించిన వివరాలు ప్రజలు ముందు పెడుతామన్నారు.బీఆర్ఎస్ కార్యకర్తలను రెచ్చగొట్టి మాజీ మంత్రి ఉసిగొల్పుతున్నారని, కాంగ్రెస్ కార్యకర్తలు సంయమనం పాటించి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తె స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలే బుద్ధిచెప్తారని హితకు పలికారు.

సెల్‌ఫోన్ అప్పగింత

మల్యాల, మే 20(ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి దర్శనంకు వచ్చిన ఓ భక్తుడు సుమారు రూ.25వేల విలువైన సెల్‌ఫోన్ పోగోట్టుకోగా పోలీస్ అవుట్ పోలీసులు వెదికి పట్టుకొని అప్పగించారు. సూర్యపేట జిల్లాకు చెందిన లక్ష్మీనారాయణ అనే భక్తుడు సోమవారం సాయంత్రం స్వామి వారి దర్శనం చేసుకొని ఆలయ ఆవరణలో పడుకున్నాడు. అయితే వేకువజామున సెల్‌ఫోన్ కనిపించక పోవడంతో పోలీస్ అవుట్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో పోలీసులు వెదకగా నూతన కోనేరు వద్ద కనిపించడంతో ఏఎస్సై చిలుక శ్రీనివాస్ భక్తునికి అప్పగించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

పెగడపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండలంలోని నార్సింహుని పేటలో ఇటీవల విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఆరెల్లి చంద్రమ్మ దుర్గయ్యల ఇల్లు దగ్ధం కాగా బాధిత కుటుంబానికి సోషల్ మీడియా దాతల సహకారంతో రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. బాధిత కుటుంబానికి సాయం చేయాలని మాజీ సర్పంచ్ నెరువట్ల బాబుస్వామి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. స్పందించిన దుబాయి ఎల్లాల శ్రీనన్న సేవాసమితి సభ్యులు, మాజీ సర్పంచులు తలా కొంత పోగు చేసి వసూలైన రూ.20 వేలను సామాజిక సేవకులు డాక్టర్ ఎల్లాల శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా మంగళవారం బాధిత కుటుంబానికి అందజేశారు.

ఆలయ వార్షికోత్సవం

కోరుట్ల, మే 20 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల పట్టణంలోని సాయిబాబ దేవాలయ 33వ వార్షికోత్సవం మంగళవారం దేవాలయ శాఖ, అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వేద పండితులు మంత్రోచ్ఛరణ మధ్య నిర్వహించారు. దేవాలయంలో సుప్రభాత సేవలతో పాటు అర్చన అభిషేక కార్యక్రమాలను జరిపారు. దేవాలయంలో హోమం నిర్వహించి వేడుకలను నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు-విజేత దంపతులు సాయిబాబను దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. దేవాలయ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు అన్న ప్రసాదం స్వీకరించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కార్యనిర్వహణ అధికారి కాంతరెడ్డి, వేంకటేశ్వర దేవాలయ అభివృద్ధి కమిటి సభ్యులు ఎతిరాజం నర్సయ్య, కాంగ్రెస్ నాయకులు అడెపు మధు, తిరుమల గంగాధర్, ఎండేరి నాగభూషణం, కొంతం రాజం, నేమూరి భూమయ్య, తెడ్డి విజయ్ రంజిత్, అర్చకులు కిరణ్ శర్మ, రమేష్ శర్మ, జగదీశ్వర్లలు పాల్గొన్నారు.

ఆలయానికి వితరణ

మల్యాల, మే 20(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానానికి కడప, హైదరాబాద్‌కు చెందిన వెంకట సాయినాథ్, వరున్, రచ్చ రాజేశ్, జయంత్ వెంకట్‌నాయక్, పురుషోత్తంరెడ్డిలు కార్పెట్ మ్యాట్ అందజేశారు. రూ.2.5లక్షల విలువైన 2079 అడుగుల కార్పెట్ మ్యాట్‌ను ఈవో శ్రీకాంత్‌కు అందించారు.

'కార్మిక చట్టాలను యథావిధిగా అమలు చేయాలి'


జగిత్యాలలో కార్మిక శాఖ అధికారికి వినతిపత్రం అందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

జగిత్యాల అర్బన్, మే 20 (ఆంధ్రజ్యోతి): పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను యథావిధిగా అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు సుతారి రాములు, కార్యదర్శి ఎండి ముఖ్రంలు డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐటీయూసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టిన అనంతరం వినతి పత్రాన్ని అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం మూడవ సారి అధికారంలోకి వచ్చాక 29 కార్మికుల చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను విభజించిందన్నారు. అసంఘటిత రంగ కార్మికులైన బీడీ, అంగన్‌వాడీ, హమాలీ, మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం చెల్లించడం లేదని ఆరోపించారు. సమాన వేతనం ఇవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయడం లేదని వారు విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఇరుగురాల భూమేశ్వర్, వెన్న మహేష్, రామిల్ల రాంబాబు, మునుగూరు హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

●**మెట్‌పల్లిటౌన్:** మున్సిపల్ కార్మికులు, హమాలీ కార్మికులు, బీడీ కార్మికులు, రైతు కూలీలతో కలిసి ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం యూనియన్ నాయకులు అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎండి ఉస్మాన్, చింత భూమేశ్వర్‌లు మాట్లాడారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మికులకున్న 44 కార్మికుల చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా చేసిందన్నారు. 8 గంటల పని దినాలను రోజుకు 12 గంటలు పని చేయాలని కేంద్ర ప్రభుత్వం యాజమాన్యాలకు వత్తాసు పలకడం సమంజసం కాదన్నారు ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కార్మికుల కష్టలను దృష్టిలో ఉంచుకొని కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాలు, ఏఐటీయూసీ, ఐఎఫ్టీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రేణుక ఎల్లమ్మ పట్నాలు


బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామస్థులు

కోరుట్ల రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి) : పంటలు సమృద్ధిగా పండి ప్రజల ఆరోగ్యాలు బాగుండాలని కోరుతూ కోరుట్ల మండలంలోని మోహన్‌రావుపేట గ్రామంలో మంగళవారం రేణుక ఎల్లమ్మ బోనాల జాతర గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో పట్నాలను వేసి వేడుకలను జరిపారు. గ్రామ శివారులోని రేణుక ఎల్లమ్మ దేవాలయ వరకు మహిళలు బోనాల శోభయాత్రను నిర్వహించారు. శోభాయాత్రలో పోతరాజులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. బోనాల శోభాయాత్ర గ్రామంలోని ప్రధాన వీదుల గుండా గ్రామ శివారులోని రేణుక దేవాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం చోటు చేసుకుంది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.

నరసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ


లక్ష్మీనరసింహ స్వామిని దర్శనం చేసుకుంటున్న భక్తులు

ధర్మపురి, మే 20 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో మంగళవారం భక్తుల రద్దీ పెరిగింది. సరస్వతి పుష్కరాలకు తోడుగా వైశాఖ మాసం, వేసవి సెలవులు కూడా రావడం వల్ల క్షేత్రం అంతట భక్తులతో నిండి పోయింది. దీంతో శ్రీలక్ష్మీ నరసింహస్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. ఉదయం వరకు దూర ప్రాంతాల నుంచి భారీగా భక్తులు క్షేత్రానికి తరలి వచ్చారు. పవిత్ర గోదావరి నదిలో పుష్కర భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. గోదావరి పౌరోహితులచే సంకల్పాది పూజలు చేయించుకున్నారు. నరసింహుడి ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కళ్యాణం జరిపించి పూజలు చేశారు. యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. అందంగా పూలతో అలంకరించిన స్వామి వారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, చిలుకముక్కు రమణాచారి, నంబి నరసింహమూర్తి నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. కాళేశ్వరంలో జరిగే సరస్వతి పుష్కరాలకు హాజరైన అనేక మంది ఆంధ్రప్రదే, మహారాష్ట్రకు చెందిన భక్తులు స్వామి దర్శనం కోసం క్షేత్రానికి తరలి వచ్చారు. భక్తులు ఇక్కడ కూడ గోదావరి నదిలో స్నానాలు చేసి స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

గోవధను ఆపాలి

ధర్మపురి, మే 20 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పుణ్యక్షేత్రం పరిధిలో బక్రీద్ సందర్భంగా గోవధను ఆపాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ జిల్లా సామాజిక సమరసత ప్రముఖ్ కస్తూరి రాజన్న ఆధ్వర్యంలో కలెక్టర్‌కు మంగళవారం వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మపురి క్షేత్రంలో ప్రతి బక్రీద్‌కు 10 నుండి 15 ఆవులను వధిస్తున్నారన్నారు. తెలంగాణ ప్రొహిబిషన్ కౌ స్లాటర్ అండ్ ప్రొహిబిషన్ యాక్టును అమలు చేసి పశు సంపదను కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వినతి పత్రాన్ని సమర్పించిన వారిలో విశ్వహిందూ పరిషత్ జిల్లా సామాజిక సమరసత ప్రముఖ్ కస్తూరి రాజన్న, ప్రఖండ అధ్యక్షులు మ్యాన పూర్ణచందర్, ధర్మపురి నగర అధ్యక్షులు గాదె లక్ష్మణ్, భజరంగ్ దళ్ నగర సహ సంయోజక్ ఆసం సురేష్ పాల్గొన్నారు.

'పార్టీలకు అతీతంగా అభివృద్ధి'

ధర్మపురి, మే 20 (ఆంధ్రజ్యోతి): పార్టీలకు అతీతంగా విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అభివృద్ధి పనులు చేస్తున్నారని టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్ అన్నారు. ప్రజా ప్రతినిధులను గౌరవించడం అనేది తమకు బాగా తెలుసునని ఆయన అన్నారు. ధర్మపురి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ధర్మపురి మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్‌తో కలిసి మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పార్టీలకు అతీతంగా ఎల్‌వోసీలు, సీఎంఆర్‌ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కులు అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో ధర్మపురి మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చిలు ముల లక్ష్మణ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు తిరుపతి పాల్గొన్నారు.

ప్రవేశాల పెంపునకు కసరత్తు

(5వ పేజీ తరువాయి)

అవకాశం కల్పిస్తున్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకుల చేత విద్యాబోధన, పరీక్ష సమయంలో విద్యార్థులకు ప్రత్యేక తరగతుల గురించి లెక్చరర్లు తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. ఎంసెట్, ఐఐటీ, నీట్ వంటి ఉన్నత పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ తరగతుల గురించి కూడా తెలియజేస్తున్నారు. ఆర్థిక, కుటుంబ కారణాలతో పదో తరగతి తర్వాత కొంతమంది ఆడపిల్లలు చదువు ఆపేయాల్సి వస్తోంది. అలాంటి తల్లిదండ్రులు గుర్తించి తమ పిల్లలు బాగా చదువుకొని జీవితంలో ఉన్నతంగా ఎదగడానికి ఎలాంటి అవకాశాలున్నాయో వివరిస్తున్నారు. పదిహేను రోజులుగా జూనియర్ లెక్చరర్ల కాంపెయినింగ్ జోరుగా సాగుతోంది.

ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తమ బోధన

-నారాయణ, జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు ప్రవేశాలు పొందాలి. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అన్ని సౌకర్యాలతో కూడిన ఉత్తమ విద్యా బోధన కల్పిస్తున్నాం. ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు తరగతులను ప్రారంభిస్తాం. జూన్ నెలలో ప్రవేశాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

పంటల సాగుపై అవగాహన


రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, రైతులు

కొడిమ్యాల, మే 20 (ఆంధ్రజ్యోతి) : కొడిమ్యాల మండలంలోని పూడూర్ రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా వరి, పత్తి, అపరాల పంటలైన పెసర, మినుము, కంది పంటల సాగుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. అపరాల పంటల పంటల సాగుతో కలిగే లాభాలను వివరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఏఈవోలు రాజేష్, శ్రీలత, మాజీ సర్పంచు రాంరెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

వలస జీవుల సౌకర్యార్థం ముంబైకి బస్సు

-విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్, మే 20 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి ముంబైకి వలస వెళ్లి ఉపాధి పొందుతున్న వారి కోసం నూతనంగా వేములవాడ నుంచి ఆర్టీసీ బస్సు ప్రారంభించినట్లు విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం వేములవాడ నుంచి చందుర్తి, రుద్రంగి, కథలాపూర్, కోరుట్ల మీదుగా ఏసీ బస్సును ప్రారంభించగా కథలాపూర్‌లో కాంగ్రెస్ శ్రేణులు స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రాంతం నుంచి ముంబై వెళ్లే వారి సంఖ్య పెరిగిన నేపథ్యంలో బస్సు నడపాలని పలువురు తన దృష్టికి తెచ్చారన్నారు. రాష్ట్ర రోడ్డు, రవాణా, బీసీ సంక్షేమ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పరిస్థితిని వివరించగా అంగీకరించారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ పులి శిరీషహరిప్రసాద్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పెగడపల్లి, మే20 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండలంలోని నంచర్ల గ్రామానికి చెందిన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ మంగళవారం రాత్రి పరామర్శించారు. నంచర్ల గ్రామానికి చెందిన ఎడ్ల రాజేందర్‌రెడ్డి సోమవారం విద్యుదాఘాతంతో మరణిం చగా లక్ష్మణ్‌కుమార్ బాధిత కుటుంబాన్ని మండల నాయకులతో కలసి పరామర్శించారు. ప్రభుత్వపరంగా సాయమందిం చేందుకు కృషి చేస్తానన్నారు. ఆయన వెంట మార్కెట్ చైర్మన్ బుర్ర రాములు గౌడ్, సత్తిరెడ్డి, రాజు, తిరుపతి, రామ్‌రెడ్డి, పవన్‌రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ


లబ్ధిదారులతో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు చెందిన 38మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే మేడిల్లి సత్యం మంగళవారం పంపిణీ చేశారు. మహిళలకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బత్తిని మల్లీశ్వరీశ్రీనివాస్‌గౌడ్, తహసీల్దార్ మునీందర్, విండో చైర్మన్లు రాంలింగారెడ్డి, చంద్రశేఖర్, ఆర్ఐలు తిరుపతి, రాణి, నాయకులు ఆనందరెడ్డి, ఆదిరెడ్డి, లక్ష్మారెడ్డి, ముత్యం శంకర్, శనిగారపు తిరుపతి, లక్ష్మణాచారి, నేరెళ్ల సతీష్‌రెడ్డి, శ్రీకాంత్, మ్యాక లక్ష్మన్, ప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

కోరుట్ల అభివృద్ధికి నిధులు కేటాయించాలి

-ముఖ్యమంత్రికి కాంగ్రెస్ నేత జువ్వాడి వినతి


సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న జువ్వాడి నర్సింగరావు

కోరుట్ల, మే 20 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల అభివృద్ధికి నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జు జువ్వాడి నర్సింగరావు మంగళవారం వినతిపత్రం అందించారు. హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కోరుట్ల పట్టణంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు గురించి సీఎం దృష్టికి తీసుకపోయినట్లు నర్సింగరావు తెలిపారు. కోరుట్ల ఆసుపత్రి అప్‌గ్రేడ్ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరినట్లు నర్సింగరావు వివరించారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

రాయికల్, మే 20 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మండల వ్యవసాయాధికారి ముక్తేశ్వర్, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, రైతులకు పచ్చిరొట్ట ఎరువులను పంపిణీ చేశారు.

తూనికలు, కొలతల దినోత్సవం

జగిత్యాల అర్బన్, మే 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా సీనియర్ సిటీజన్స్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం తూనికలు, కొలతల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సీనియర్ సిటీజన్స్ అధ్యక్షులు హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రజల నిత్య జీవితంలో తూనికలు, కొలతకు చాలా ప్రాధాన్యం ఉన్నదని, 1875 మే 20 న ప్రపంచ తూనికలు, కొలతల దినోత్సవాన్ని స్థాపించిన సందర్భాన్ని పురస్కరించుకుని తూనికలు, కొలతల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సినియర్ సిటీజన్స్ జిల్లా నాయకులు గౌరిశెట్టి విశ్వనాథం, వెల్ముల ప్రకాశ్ రావు, పి. అశోక్ రావు, కొయ్యాడ సత్యనారాయణ, దిండిగాల విఠల్, రాజ గోపాలా చారి, దెవెందర్, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

ఇబ్రహీంపట్నం, మే 20(ఆంధ్రజ్యోతి) : ఇబ్రహీంపట్నం తహసీల్దార్‌గా పనిచేసి ఇటీవల బదిలీపై నిజామాబాద్ వెళ్తున్న తహసీల్దార్ ప్రసాద్‌ని మంగళవారం స్థానిక రైతు వేదిక కార్యాలయంలో మండలస్థాయి అధికారులు ఘనంగా వీడ్కోలు పలికి సన్మానించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతు ఇబ్రహీంపట్నం మండల ప్రజలు, నా తోటి అధికారులు చాలా మంచివారని, తన బాధ్యతతో ఎప్పుడు సహకారం అందించారని కొనియాడారు. తాను ఇక్కడ పనిచేసిన ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఇక్కడి రాజకీయ నాయకులు, నా తోటి అధికారులు సహకరించారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగాం రాజు, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, మాజీ ఎంపీపీ నేరెళ్ల దేవేందర్, గూడ శ్రీకాంత్, మండల రేషన్ డీలర్లు, పంచాయతి కార్యదర్శులు, మండల్ రెవిన్యూ సిబ్బంది, మీసేవ కేంద్ర నిర్వాహకులు, నాయకులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరం

పెగడపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండలంలోని దోమలకుంటలో మంగళవారం పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గేదెలకు, ఆవులకు, దూడలకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ హేమలత, పశువైద్య సిబ్బంది మతిన్, జానీపాషా, ఓదవ్వ, ఏఎంసీ డైరెక్టర్ లక్ష్మీరాజం పాల్గొన్నారు.

పీసీసీ పరిశీలకుడికి సన్మానం

మెట్‌పల్లిటౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండల మాజీ ఎంపీపీ, ఉమ్మడి జిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శి కోటగిరి వెంకట స్వామి నివాసంలో పీసీసీ పరిశీలకుడు అవేజ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రమాదేవి, చైతన్య, శేఖర్, రాజకుమార్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర


శోభాయాత్ర నిర్వహిస్తున్న హనుమాన్ దీక్షాపరులు

పెగడపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండలంలోని రాజారాంపల్లిలో మంగళవారం హనుమాన్ దీక్షాపరులు శోభాయాత్ర నిర్వహించారు. ఈ నెల 22న పెద్ద హనుమాన్ జయంత్యుత్సవాలలో బాగంగా రాజారాంపల్లిలో దీక్షాదారులందరు అంజనే యుడి గుడి నుంచి గ్రామం పురవీధులలో జైశ్రీరాం, జైజై శ్రీరాం అంటూ హనుమాన్ జెండాలు చేతబట్టి గ్రామస్థులతో కలసి శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ రాజశేఖర్ గౌడ్, మిట్టపల్లి రాజేందర్ రెడ్డి, భూపతి రాములు, సాయిని రవీందర్, కిరణ్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

అఖండ రామ నామ సంకీర్తన

కొడిమ్యాల, మే 20(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని వాగు ఒడ్డున ఉన్నశ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం ఆరు గంటలకు హన్మాన్ దీక్షాపరుల అఖండ రామ నామ సంకీర్తన ప్రారంభమైంది. ఆలయంలో మంగళవారం ఉదయం ఆరు గంటలకు ప్రారంభమైన అఖండ రామ నామ సంకీర్తన 24 గంటలు నిరవధికంగా రామ నామ సంకీర్తనను హన్మాన్ దీక్షాపరులు బుధవారం ఉదయం ఆరు గంటల వరకు పఠిస్తారు. రామ నామ సంకీర్తనతో, శ్రీరామ జయ రామ జయ జయరామ, హరే రామ హరే కృష్ణ హరే క్రిష్ణ క్రిష్ణ హరే హరే భక్తి గీతాలతో, భజన కార్యక్రమాలతో ఆంజనేయస్వామి ఆలయ పరిసరాలు మార్మోగాయి. ఉదయం నుంచి ఆంజనేయ స్వామి భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. మండల కేంద్రంలోని విశ్వబ్రాహ్మణ వీధిలోని ఆంజనేయస్వామి ఆలయంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

'విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాలి'


ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న మండల విద్యాధికారి నరేశం

కోరుట్ల, మే 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాలని మండల విద్యాధికారి నరేశం అన్నారు. మంగళవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలిక పాఠశాలలో ఉపాధ్యాయులకు కెపాసిటి బిల్డింగ్ అను అంశంపైన ఐదు రోజుల శిక్షణ తరగతులను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు కృష్ణమోహన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి ఉపాధ్యాయులకు పలు సూచనలు సలహాలను అందించారు. ఏఐ ద్వారా బోధన మెరుగుపరిచి పిల్లల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచాలన్నారు. పిల్లలో భావ వ్యక్తీకరణ, విషయ పరిజ్ఞానంపై ఆసక్తికరమైన విధంగా బోధనను అందించి వారిలో సృజనాత్మకథ నింపాలని సూచించారు. ఈ కార్యక్రమాల ద్వారా పాఠశాల స్థాయిలో విద్యను బలోపేతం చేసి ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి పరచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ అందే శివప్రసాద్, సిరిపురం శ్రీనివాస్, అంకం దామోదర్, గంగుల రణదీర్, అన్నం మహేష్, మాసం చిరంజీవి, కోసరి శేఖర్, సీఆర్‌పీలు గంగాధర్, దేవేందర్, సత్యనారా యణ, మన్విత, జ్యోతి, కంప్యూటర్ అపరేటర్ రాజశ్వేర్‌లతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●బీర్‌పూర్, మే 20 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం సెకండరీ గ్రేడ్ టీచర్స్‌కు శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో ఎంఈవో నాగభూషణం, శిక్షకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలు

కథలాపూర్, మే 20 (ఆంధ్రజ్యోతి) : కథలాపూర్ మండలంలోని దుంపెటలో మంగళవారం త్రినేత్రి కంటి వైద్యశాల ఆధ్వర్యంలో మహిళా సంఘ సభ్యులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. వైద్యుడు షైన శ్రీధర్ నేతృత్వంలో సుమారు 50 మందికి కంటి పరీక్షలు అధునాతన యంత్రాలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం నరహరి, సీసీ అంజయ్య, మాజీ సర్పంచ్ జెల్ల వేణు గోపాల్, ఊడుగుల రాజేందర్, భూపెల్లి రాకేశ్, గ్రామస్థులు ఉన్నారు.

'కేసీఆర్ కట్టడాలు చరిత్రకు సాక్ష్యాలు'

కథలాపూర్, మే 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్మించిన కట్టడాలు చరిత్రకు సాక్ష్యాలుగా నిలిచిపోతాయని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి పేర్కొన్నారు. చెరిపివేస్తే చెరిగిపోవని ఆయన అన్నారు. మంగళవారం కథలాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోలీస్ కమాండ్ కంట్రోల్ రూం, యాదాద్రి దేవాలయం, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహాలు రాష్టానికే తలమానికంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వ చిహ్నం నుంచి తొలగిస్తామన్న చార్మినార్, రామప్ప దేవాలయం మిస్ వరల్డ్ పోటీదారులకు చూపించాల్సిన గతి ప్రభుత్వానికి దిక్కయిందని ఆరోపించారు. కేసీఆర్ నిర్మించిన కట్టడాలను కూడా పోటీదారులకు చూపిస్తే బాగుంటుందని అన్నారు.

నారాయణ కుటుంబ సభ్యులకు పరామర్శ

కోరుట్ల రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల జైత్ర యాత్ర నిర్మాణ కర్త, మాజీ మావోయిస్టు నేత నారాయణ కుటుంబ సభ్యులను టీడీపీ నియోజకవర్గ ఇంచార్జు మానుక ప్రవీణ్ కుమార్ పరామర్శించారు. కోరుట్ల మండలంలోని సర్వరాజుపూర్ గ్రామంలోని నారాయణ ఇంట్లో వారి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం నారాయణ చిత్రపటానికి ఆయన పూల మాల వేసి నివాళులు అర్పించారు. నారాయణ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. నారాయణ కుటుం బాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాలే మారుతి, కటకం మహాదేవ్, సాదుల్ల, గంగుల నారాయణ, రమేష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.